

# సినిమాకు నీతి చంద్రిక

హారి మీ! మీ నికార్సైన అభిప్రాయాలు బజార్న పడా! ఎంతమాట సెలవిచ్చారు సార్. రైటేసుకోండి. సినీ లోకరీతిమీద జారీ అయినట్టి నీతిచంద్రిక ఇంటరెస్టింగానే ఉందిగాని, అచ్చుతప్పులున్నాయి గదూ! అదే....ఒక్కొక్క స్టారు సాలు కారు పిక్చర్లకన్న నటించకూడదని పడింది--26 బదులు, హౌ సిల్లీ? ఆరు పిక్చర్లలోవేస్తే ఇండస్ట్రీ బ్రతికినట్టేనా అంట. స్టార్లకి కాన్సెన్ట్రేషను జాస్తి అయిపోదూ! ఇపుడే కథలు అంతమాత్రంగా ఉంటున్నాయి, డైలాగులూ వీళ్ళ నిముడ్చుకో లేక పిగిలిపోతున్నాయి. స్టార్లు అట్టే అలోచించకుండానే ఎన్నో సంస్కరణలు చేస్తున్నారు, రేప్పొద్దున్న తక్కువ పిక్చర్లలోవేస్తే ఇంకా దుంప తెంపెయ్యరూ! కథ గురించి నిజంగా ఆలోచించెయ్యరూ! వేషం రీలు కెన్నేసి ఫ్రేముల్లో ఉందో చూసుకుంది కీమాత్రమే తీరికున్న వాళ్ళు రేప్పొద్దుట్నించీ అడుగడుగునా మంచేవిటి, చెడ్డేవిటి, తలేవిటి, తోకేవిటి, కథేమిటి కమామీషేవిటని తగులుకోరూ. హమ్మో! కొంపలు మునిగిపోతాయి. అలాగే ఇంకో వెకిలిరాత కూడా ఉంది. స్టార్లు తమక్కావలసిన వాళ్ళచేతే మేకప్పు వేయించుకుంటామని పట్టుబట్టకూడదుష.

ఇంకా నయం, క్యారెక్టరికి తగ్గట్టే వేషం వేయించుకు తీరాలన్నారు గాదు. ఏమో ఏం చెప్పగలం. రేప్పొద్దున్న లేవగానే "అంతేకాదు పాత్రకి తగిఉంటేనే వేషం వెయ్యాలి" అని శాసించినా శాసిస్తారు, వాళ్ళ సొమ్మేంపాయె.

ప్రొడ్యూసర్ల గురించి మటుకు మీరు మంచి ముక్క చెప్పారు. తగినంతే కారణం లేందే డబుల్ వర్షను తీయకూడదని........సింగిలు వర్షను చిత్రాలన్నిటికీ తగినంత కారణాలుంటాయని ఎంత గడుసుగా ఒప్పుకున్నారు. చూశారూ, రచన అంటే అలా వుండాలి. ఒక్క వాక్యం చాలు గంగిగోవుపాలు అన్నట్లుగా. మెచ్చుకోవల్సించోట నేను కుండబద్దలు కొట్టినట్లు మెచ్చేసుకుంటాను. అది నా దుర్గుణం. ఏం చేస్తాం. పేచీ అల్లా ఇదో ఈ స్టార్ల దగ్గిరే.

మరేం లేదు. ఒహపక్కనుంచి కొత్తవాళ్ళు రావాలోయ్ అంటూ మరొహపక్క ఉన్నవాళ్ళ కిలాటివి నూరిపోస్తే యలాగా అంటా. ఇవి నూరిపొయ్యడమ్మూ, మరో పక్క నూరిపోయాల్సిన నూరు హంశాల గురించి అసలు మాటేనా ఎత్తకపోడవూఁను దారుణం గాదూ!

ఏదీ! కొందరు హీరోలూ హీరోయీన్లూ అయికమత్యానికి ఆ నామం పెట్టేసి,వేళకి షూటింగు కొచ్చేయడం తప్పని దుయ్యబట్టరేం? చక్కగా పదకొండింటికొచ్చి ఆకలేస్తోందని పన్నెండున్నరకి చెక్కే సేవాళ్ళ అడుగు జాడల్లో వీళ్ళంతా వెళ్ళరేవిటని నిల్దీసి అడగరేం? లావొక్కింతయులేదు అంటూ, చిక్కిపోతున్నవాళ్ళని పట్టుకు చీవాట్లెయ్యరేం?

* * * *

యాక్టింగుకేం లెండి పేరుగురించిగదా అనేవాళ్ళ కసలీ శాల్తీల గురించి పట్టింపేల? డబ్బింగు సినిమావాళ్ళ పద్ధతులు అందరూ ఎందుకు పట్టుకు వేళ్ళాడరు? అహ తెలీకడుగుతాలెండి. డబ్బింగువాళ్ళు అరవ సినిమాకథ, మాటలు రాసినవాడి పేరుని ఎంత చక్కగా తెనిగిస్తున్నారు తెలుగులోకి? అసలు వాడిగుట్టు మనకి తెలీనిస్తున్నారా? అలాగే అరవ పిక్చరుకి పాటలు చేసినమ్యూజికుడైరెక్టరు పేరుని, తెలుగులో రీరికార్డింగు చేసినవాడి పేరులోకి ఎంత షోగ్గా తర్జుమా చేస్తున్నారూ? అక్కడితో ఆగిపోతారేవీ అని.

అందులో శివాజీగణేశనూ పద్మినీ నటిస్తే పబ్లిసిటీలో రామారావూ అంజలీదేవి అవటాని ట్రాన్స్లేట్ చేసి అఘోరించవచ్చుగా? తిన్నగా తెలుగులో తీసేవాళ్ళుకూడా అంజలీ రామారావుల పేరు గురించేగా బెంగెట్టుకున్నదీ, వాళ్ళ ప్రజ్ఞని యలాగా వాడుకోదల్చుకో లేదుగా? అంచేతిలా చేస్తే చక్కహా ఫలానాదీ డబ్బింగు సినిమా అయినట్టు మూడో వాడికి తెలీదు. ఇటు తెలుగులో పేర్లూ ఉంటాయి.

ఇదే స్కీము టెల్గూ పిక్చర్లలోకూడా వాడుకోవచ్చు. కాల్షీట్లు ఇవ్వని, ఇచ్చినా ఆలీశంగా వచ్చి ఆర్కెస్ట్రా లేకుండా ఏడిపించేవాళ్ళనీ పేరుకోసం బుక్ చేసుకొని వాళ్ళకిచ్చే బ్లాకూ వైటూ కూడా పారేసి ఆ వేషాలకే పదో పరకో పారేసి కొత్తవాళ్ళని బుక్ చేసుకోవచ్చు. పెద్ద వాళ్ళ పేర్లుంటాయి, కొత్తవాళ్ళ మొహాలుంటాయి. ఉభయతారకం. స్టార్లు బెంగెట్టుకుంటారని బెంగక్కర్లే. ఈమధ్యనో తారన్నట్లు--వేషం ఎలా అఘోరించినా పట్టింపులే దావిడకి.

ఈ బాపతుపని కొంత ఇపుడు లాంగ్షాట్లో ఎలాగూ జరుగుతోంది స్టాండుబై యాక్టర్లద్వారా. ఇక మిడ్లాంగ్కీ, క్లోజప్కీ రావడం తరువాయి.

అలాగే తీరికలేని రైటర్ల సంగతీని. అండర్ గ్రవుండులో వుండి రాసే తీరికా, ఓపికాలేని గొప్ప రైటర్లందరికీ డబ్బిచ్చేసి పేరుకొనుక్కుని తరువాత వర్ధమానునికి పదోపరకో పారేసి రాయించుకోవటం--వాళ్ళ పేరూ వీళ్ళ రాతాను మోతగా ఉంటుంది ఒక• టెనాలీ జంటిల్మన్ అన్నట్టు.

అమాట కొస్తే ఇదీ కొత్తగాదనుకోండి, జరుగుతున్న కథ గదా.

మ్యూజికు విషయంలో మాత్రం ఈ పద్ధతి రివర్సులో వాడాలి. ఒక్కొక్క టెలుగు పిక్చరులో ఐదారు హిందీ హిట్ సాంగులు గుప్పిస్తున్న ప్రొడ్యూసర్లు ఆ రీరికార్డింగు పనికీ కుదుర్చుకుంటున్న మ్యూజికు డైరెక్టరికీ ఇంకో పది వేలు పారేసి, పేరు సంగతి మర్చి పొమ్మనాలి. అపైన తమ పిక్చరుకి మ్యూజికు డైరెక్టర్లు శంకర్--జైకిషన్, బర్మన్, రామ చంద్ర అని పబ్లిసిటీ ఇస్తే బాక్సాఫీసు డ్రా ఇంకా బావుంటుంది. చిత్రగుప్త, రవి వగైరాల పాటలు పుచ్చుకున్నపుడు మాత్రం శంకర్ జైకిషన్, బర్మన్ అనే వేసెయ్యడం మంచిది.

ఇదీ బుద్ధిమంతుల పద్ధతి

* * * *

ఎక్సయిజు సుంకం పేరిట హాలువాళ్ళు ఆటకి రెండేసి రూపాయలు అచ్చుకోవాలని స్టూడియోలవాళ్ళూ, కాదు మీరేనని హాళ్ళవాళ్ళూ అంటున్నారు. ప్రొడ్యూసరింకా ఏవీ అనకుండానే ఈ రెండు వర్గాలవారూ ఇలా వాదించుకోడం చూసి పెద్దతారలు కొంచెం ఖంగారు పడుతున్నారు-ఇది ఇటు తిరగదుగదా అని. మరేం ఫర్వాలేదు. తెర వేలుపుల జోలికి ఎవడూ పోలేడు. మహా అయితే చిన్న నటులు భరిస్తారు దానికేం.

"అయినా కాకపోయినా ఇదేవంత పెద్దమొత్తం గనకా వెధవ రెండు రూపాయలు, సముద్రంలో నీటి బొట్టంతా" అన్నాడు ఒక వర్గపాయన రెండో వర్గం వాళ్ళకేసి కోరగా చూసి.

"అదేంమాట. లిటిల్ డ్రాప్స్ జాయిన్ టుగెదర్ టు మేకె నోషన్. చిన్న చిన్న నీటిబొట్లు కలిస్తేనే సముద్రాలు తయారయేది" అన్నాడు నీటిబొట్ల విలువ తెలిసిన ధన సముద్రుడు.

మొత్తానికి మనం వీటి గురించి అట్టే చర్చించడం క్షేమకరం కాదు. వాళ్ళూ వీళ్ళూ కలిసి మన్నెత్తికి తోసేగల్రు.

